ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.6 ; కనిష్ఠం 24.5

కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 15 మే 2025

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి

• డీపీఎం రమేష్‌బాబు

రాజంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాయిపల్లి గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం రమేష్‌బాబు పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 69 మంది రైతులు 6,558 బస్తాలు, 2,623 క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లుకు తరలించామన్నారు. ట్యాబ్ ఎంట్రీ చేయడంతో పాటు, మిగిలిన ధాన్యాన్ని కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజేందర్, సాయిలు, అధ్యక్షురాలు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు శాఖలో.. ఇసుక తుఫాను!

- ఇసుక అక్రమ దందాకు కొందరు పోలీసుల సహకారం
- మామూళ్లు ఇవ్వని వాహనాల సీజ్
- మామూళ్లు ఇచ్చేదాక వదిలిపెట్టని వైనం
- ఏసీబీ సోదాల్లో బయటపడ్డ పోలీసుల అక్రమాలు
- బిచ్కుందలో ఏసీబీ తనిఖీలతో పోలీసు, ఇసుక మాఫియాలో కలకలం
- ఇసుక అక్రమ రవాణాలో కింది నుంచి పైస్థాయి వరకు కొందరు పోలీసుల హస్తం
- గతంలోనూ ఇదే వ్యవహారంలో పలువురు సిబ్బంది సస్పెన్షన్
- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని పోలీసుల తీరు



బిచ్కుంద పోలీసు స్టేషన్

కామారెడ్డి/బిచ్కుంద, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో ఇసుక తుపాన్ మొదలైంది. గత కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణాకు కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది సహకరిస్తున్నారని, ఇసుక దందాలో పరోక్షంగా కొందరు పోలీసుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడమే కాకుండా గతంలో ప్రభుత్వం సైతం హెచ్చరించింది. తాజాగా ఏసీబీ అధికారుల సోదాలో, విచారణలో ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల హస్తం ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసుశాఖలో ఇసుక తుపాన్ కలకలం రేపుతోంది. బిచ్కుంద పోలీసుస్టేషన్‌లో ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్లను వదిలేందుకు కొందరు పోలీసులు డబ్బులు వసూలు చేశారని ఏసీబీ విచారణలో బయటపడడం ఇందుకు నిదర్శనం. కామారెడ్డి జిల్లాలో మంజీరా నది పరివాహక ప్రాంతంలో ఇసుక మాఫియా అక్రమంగా ఇసుక దందాను నడుపుతునే ఉంది. కట్టడి చేయాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుంటూ ఇసుక దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

బిచ్కుంద పోలీసు స్టేషన్‌లో ఏసీబీ సోదాలతో కలకలం

ఇసుక అక్రమ రవాణా, మామూళ్ల వసూళ్ల ఫిర్యాదుల నేపథ్యంలో బిచ్కుంద పోలీసుస్టేషన్‌లో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. ఏసీబీ సోదాలతో అటు పోలీసు శాఖలో, ఇటు ఇసుక మాఫియాలో కలకలం రేపింది. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పది ఇసుక ట్రాక్టర్లను బిచ్కుంద పోలీసులు ఇటీవల పట్టుకుని సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో ట్రాక్టర్లను విడుదల చేసేందుకు స్టేషన్‌లోని కొందరు పోలీసులు డబ్బులు వసూళ్లు చేశారని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తమ విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఆధారాలు కూడా సేకరించామని ఇసుక అక్రమ రవాణాకు కొందరు పోలీసుల సహకారం ఉన్నట్లు ఏసీబీ అధికారులే చెప్పడం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇసుక అక్రమ రవాణాకు మామూళ్లు వసూళ్లు చేసింది స్టేషన్‌లోని ఏ పోలీసు అధికారులు, సిబ్బంది ఎవరనేది ఏసీబీ అధికారులు వెల్లడించలేదు. అయితే ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్న సమయంలో స్టేషన్ పక్కనే ఉన్న సర్కిల్ కార్యాలయంలో బాన్సువాడ డీఎస్పీ, సర్కిల్ సీఐ ఉన్నారు. ఏసీబీ అధికారులు మామూళ్ల వసూళ్లపై ఈ అధికారులను సైతం ఆరా తీసినట్లు తెలిసింది. గతంలోనూ బిచ్కుంద, మద్నూర్, బాన్సువాడ, బీర్కూర్ మండలాల పరిధిలో ఇసుక అక్రమ రవాణాకు కొందరు పోలీసు సిబ్బంది సహకరించారనే నేపథ్యంలో అప్పటి ఎస్పీ శ్వేతారెడ్డి సస్పెండ్ చేసిన ఘటనలు ఉన్నాయి. మరోసారి ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల హస్తం ఉందని ఏసీబీ సోదాలు చేయడంతో పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు పోలీసు శాఖలోని కొందరి హస్తం

మంజీరా నది పరివాహక ప్రాంతమైన బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, మద్నూర్ మండలాల పరిధిలో ఇసుక దోపిడీకి అడ్డు లేకుండా పోయింది. టీజీఎండీసీ నుంచి అనుమతి లేకపోయినప్పటికీ స్థానిక పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారుల సహకారంతో ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వుతూ అక్రమంగా తరలిస్తున్నారు. బిచ్కుంద, బీర్కూర్ మండలాల్లో మంజీరాకు ఇరువైపుల సాగుతున్న ఇసుక దందాలో కొందరు పోలీసులే ప్రత్యేక పాత్రధారులుగా నిలుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఇదంతా జరుగుతుందని ప్రచారం జరుగుతోంది. వే బిల్లులు లేకుండానే ట్రాక్టర్లలో భారీగా ఇసుక తరలివెళ్తుంది. రాత్రి వేళ టిప్పర్, లారీల్లో మంజీరా ఇసుకను కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాలో పోలీసు శాఖలోని కిందస్థాయి నుంచి పైస్థాయి వరకు కొందరు పోలీసుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ రవాణాలో సహకరిస్తున్న పోలీసులపై జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర మరింత దృష్టి సారించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

గతంలోనే హెచ్చరించిన ప్రభుత్వం

ఇసుక అక్రమ రవాణాను సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో కలెక్టర్‌లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇసుక అక్రమార్కులపై పోలీసుశాఖ ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాలో కొందరు పోలీసు అధికారుల ప్రమేయం ఉందని అప్పట్లో ప్రభుత్వం హెచ్చరించింది. కానీ పోలీసుల తీరు మాత్రం మారడం లేదు. జిల్లాలో ఇసుక రవాణాకు మాత్రం ఎక్కడ కళ్లెం పడడం లేదు. సీఎం హెచ్చరించినా రాత్రి పగలు తేడా లేకుండా చాలా చోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో మంజీరాలో ఇసుకను కొల్లగొడుతున్నారు. మొన్నటి వరకు జీరో దందా నడుపగా ఇప్పుడు ఏకంగా వేబిల్లుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ఆయా మండలాల్లో పోలీసు స్టేషన్‌ల ముందు నుంచే ఇసుక అక్రమంగా తరలివెళ్తున్నా అడ్డుకునే వారే లేరు. ఇసుక అక్రమ రవాణాలో జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్సైల ప్రమేయం ఉందని గతంలోనూ నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. సదరు సీఐ, ఎస్సైల జాబితా జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సదరు పోలీసు అధికారులు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేటు పడుతున్నా మారని తీరు

ఎక్కడైన ప్రజలకు అన్యాయం జరిగితే న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. కానీ జిల్లాలోని కొందరు పోలీసులే సరైన న్యాయం చేయడం లేదని శాఖ ఉన్నతాధికారులకే కాకుండా ఏసీబీకి ఫిర్యాదులు వెళ్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇసుక అక్రమ రవాణా, భూ పంచాయతీలు, కుటుంబ కలహాలు, అక్రమ సంబంధాలు, పేకాట కేసులలో భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నాలుగు నెలల కాలంలో ఇద్దరు ఎస్సైలతో పాటు ఒక హెడ్ కానిస్టేబుల్ అవినీతి అక్రమాలకు పాల్పడి ఏసీబీకి పట్టుబడ్డారు. లింగంపేట పోలీసు స్టేషన్‌లోనే ఇద్దరు ఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్‌లు లంచం తీసుకోవడం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదేవిధంగా పోలీసుశాఖలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసు అధికారులతో పాటు సిబ్బందిపై జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర కొరడా ఝులి పిస్తున్నారు. రెండు నెలల కాలంలో ఇద్దరు ఎస్సైలతో పాటు మరో నలుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఇలా ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నా విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై ఎస్పీ చర్యలు తీసుకుంటున్నా పోలీసుశాఖలో కొందరు అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు.



పోలీసు స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు (ఇన్‌సెట్‌లో) వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

ఏళ్లు గడుస్తున్నా.. సాగని రహదారుల నిర్మాణం

- ఎనిమిదేళ్లు గడిచినా ముందుకు సాగని చెరువు ముందు తండా రోడ్డు నిర్మాణం
- ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం పంపిన నివేదిక కాగితాలకే పరిమితం
- మారుమూల తండాల రహదారులపై అధికారులు, పాలకుల సవతి ప్రేమ


7

వెట్టి చాకిరీ ఇంకెన్నాళ్లు!?

- 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రతిపాదికన కొనసాగుతున్న రెండో ఏఎన్ఎంలు
- చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్న వైనం
- రెగ్యులరైజ్ కోసం ఎదురు చూపులు


7

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- గ్రామాల్లో సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు
- సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు


7

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి : కలెక్టర్

కామారెడ్డి టౌన్/లింగంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కవుట్, ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రూ.5 లక్షలతో నిర్మించే ఈ పథకం ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని తెలిపారు. అడ్లూర్‌కు చెందిన గండ్ల హేమలతకు ఇందిరమ్మ పథకం కింద తనకున్న 575 స్క్వేర్ ఫీట్‌ల ఇంటి స్థలంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. తన భర్త మరణించాడని తన ఇద్దరు కొడుకులను బీడీలు చుడుతూ చదివిస్తున్నానని తెలిపింది. తనకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. బెస్మిట్ లెవల్ వరకు నిర్మించుకున్న తర్వాత ప్రభుత్వం రూ.ఒక లక్ష తొలి విడతగా అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ జైపాల్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

3.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో 2024-25 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు జోరుగా సాగుతుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 446 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 58,665 మంది రైతుల నుంచి రూ.735 కోట్ల విలువైన 3.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణతో రాష్ట్రంలో జిల్లా తృతీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇప్పటి వరకు 44,204 రైతులకు గాను 616.10 కోట్ల వరకు డబ్బులు చెల్లింపులు కూడా పూర్తయ్యాయని తెలిపారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో వివిధ పనులకు పలు నిధుల నుంచి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రత్యేక అభివృద్ధి నిధులు, కృషియల్ బ్యాలెన్సింగ్ నిధులు, జిల్లా ఖనిజ నిధులు, జిల్లా ఖనిజ నిధుల వడ్డీ నిధుల ద్వారా మంజూరు చేయబడిన పనుల పురోగతిపై చర్చించారు. మంజూరు చేయబడిన పనుల నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయనందున అసహనం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్‌శాఖలకు మంజూరు చేసిన నిధులతో ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తమ ఆట పాటల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు.

సొంతింటి కలను తీర్చేందుకే ఇందిరమ్మ ఇళ్లు

లింగంపేట: పేదల సొంతింటి కలను తీర్చేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. లింగంపేట మండలంలోని ముస్తాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, మే 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ పల్లె, మండలంలో ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా పార్టీకి కార్యకర్తలే పునాది లాంటివారని అందరూ కలిసికట్టుగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని అన్నారు. గత పాలకులు ఎల్లారెడ్డి నియోజక వర్గాన్ని పట్టించుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, మినీ ట్యాంక్ బండ్, సీసీ రోడ్లు, నిర్మించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్లు సత్యనారాయణ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, ఎనిమిది మండలాల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రజిత రెడ్డి, పరమేష్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల కోసమే గోదాముల నిర్మాణం

గాంధారి: రైతుల అవసరాల దృష్ట్యా గోదాంల నిర్మాణం చేపడుతున్నట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. గాంధారి మండలంలోని నేరల్‌తండా, గుర్జల్, పేట్‌సంఘం గ్రామాల్లో గోదాంల ప్రారంభోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసమే గోదాముల నిర్మాణం చేపడుతుందని తెలిపారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతులకు దగ్గరగా ఉండాలని నిర్మించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. రైతు బాగుంటేనే అందరూ బాగుంటారని అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని ప్రతీ మండలంలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేట్‌సంగెం, గుర్జల్ గ్రామంలో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కాగా మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నారాయణ గిరి వద్ద వైభవంగా శివభక్త మార్కండేయ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ పరమేష్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ తూర్పు రాజు, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

పేదోడి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

తాడ్వాయి: ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఆయన మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 33 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన నిరుపేద లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. దీనికి ప్రభుత్వ అధికారులు సహకరించి తరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేసే బాధ్యత అధికారులదేనని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే అన్నారు. త్వరలో 22వ ప్యాకేజీ ద్వారా కాళేశ్వరం నీటిని కూడా తీసుకువస్తామని తెలిపారు. ప్రతీ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఈయన అన్నారు. గ్రామాల్లోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వరకు పర్యవేక్షించాలని కార్యకర్తలకు సూచించారు. కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ చారి, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు ఏనుగు మోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సారెడ్డి, సాయిలు, మండల గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఎక్కడా లోవోల్టేజీ సమస్య రావద్దు

లింగంపేట: మండలంలోని బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే మదన్ మోహన్ పీటీఆర్‌ను ప్రారంభించారు. బాణాపూర్ సబ్‌స్టేసన్ పరిధిలోని 8 గ్రామాలకు లోవోల్టేజీ సమస్య తీరుతుందని అన్నారు. ఒంటర్‌పల్లి తండాలో బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీలత, నాయకులు జొన్నల రాజు తదితరులు ఉన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

• ఉమ్మడి నిజాంసాగర్ మండల మానిటరింగ్ అధికారి కరుణాకర్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహమ్మద్ నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ నగర్ మండలంలోని సొసైటీ పరిధిలో వరి కొనుగోలు కేంద్రాలను ఉమ్మడి నిజాంసాగర్ మండల మానిటరింగ్ అధికారి కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం 'దళారులుగా అవతారమెత్తిన రైస్‌మిల్లర్లు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీనిపై అధికారులు కదలివచ్చారు. మండలంలోని నర్వ, గున్కుల్, మహమ్మద్‌నగర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం రైతులు పండించే ప్రతీ గింజను కొనుగోలు చేస్తుందని తెలిపారు. తరుగు విషయంలో రైస్‌మిల్లర్లతో మాట్లాడి ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో రాములు, సిబ్బంది సాయితేజ, భాస్కర్, రాజేందర్, రైతులు రాములు, సాయిబాబా, అంజయ్య, భూమయ్య, లాలు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు


మేడిపల్లి కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

మోస్రా,మే14(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని మేడిపల్లి గ్రామంలో వృషభ సంక్రమణం మాసం ప్రారంభం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు. అదే విధంగా జాతర, కుస్తీపోటీలు ఏర్పాటు చేయగా పోటీలో పాల్గొనేందుకు జిల్లాలోని మల్లయోధులు పోటీలో పాల్గొన్నారు.గెలుపొందిన మల్లయోధుడికి నగదు బహుమతి ఇచ్చి సత్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ హనుమాన్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాయక్, కారోబార్ గంగాధర్, నాయకులు, కారోబార్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



వెంచిర్యాల్‌లో భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటి చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

మోర్తాడ్, మే 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని దోన్‌పాల్‌లోని 1994లో ఇందిరమ్మ పథకం కింద ఇచ్చిన ఇండ్ల పట్టాలకు అధికారులు స్థలాలు చూపించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 222 లో 80 ప్లాట్లు మంజూరు చేశారని పట్టాలు కూడా ఇచ్చారని, కాగా ఇంతవరకు లబ్ధిదారులకు ప్లాట్లు చూయించలేదని మహిళలు ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని ఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఇప్పటికైనా 80 మంది లబ్ధిదారులకు 222 సర్వే నంబర్‌లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.ఈమేరకు తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. మాస్ లైన్ ప్రజాపంత ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగపోసాని,కిషన్ భూమగంగు, యమున, సాయమ్మ, లక్ష్మీ, బాజమ్మ, మొగులిసాబ్, రాజు, గంగాధర్, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తుందని ఆయన అన్నారు. అనంతరం రెంజర్ల గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌ఆనంద్, పంచాయతీ సెక్రటరీలు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, సామరాజేందర్, నడుకుడ రాజారెడ్డి, బీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు, కాంగ్రెస్ కమిటి నాయకులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలం

● టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్

కోటగిరి,మే14(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులను సాధించుకోగలమని టీయూసీఐ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ పేర్కొన్నారు రుద్రూరు మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 139సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం రక్త తర్పణం చేసి 8గంటల పని దినాన్ని సాధిస్తే నేటి పెట్టుబడిదారి వర్గాలు 13గంటల పాటు కార్మికులు పని చేయాలని సూచించడం సిగ్గుచేటన్నారు. కార్మికులు అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 29చట్టాలను నాలుగు కోడ్‌లగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చివేసే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు లాలయ్య, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లత, యశోద, లక్ష్మీ, శంకరమ్మ, అనిత, మౌనిక, జ్యోతి, శీరిషా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఆర్మూర్‌రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేయ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధానకార్యదర్శి పి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని ఐఎంఎ హాల్‌లో జిల్లా అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు బిన్నంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు మరణశాసనం విదించిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధా న కార్యదర్శి దాసు, ఉపాధ్యక్షుడు సూర్య శివాజీ, సహాయకార్యదర్శి శివ కుమార్, జేపీగంగాధర్,మల్లికార్జున్, బాలయ్య పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు అవాస్తవం'

బోధన్‌రూరల్,మే14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం, నిరుపేదలకు తక్కువ ధరకు ముడి సరుకు అందించడం కోసం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బోధన్, సాలూర మండలాలలో అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఆరోపణలు అవాస్తమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మండలంలో ఎమ్మెల్యే ఇసుక క్వారీలకు అనుమతి ఇవ్వడం వల్ల మండల రెవెన్యూ కార్యాలయాల్లో 3కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ప్రభుత్వాన్ని బాద్నాయ్ చేయడానికి అసత్య ప్రచారం చేస్తున్నారని దీనిని ఖండిస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలు ఇసుక అక్రమ రవాణా జరిగిన నోరు మెదపని వారు ప్రస్తుతం రైల్వే లైన్‌లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం తక్కువ ధరకు ఇసుక రవాణా చేస్తుంటే వారు చూడలేక పార్టీపై, పార్టీ ముఖ్య నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. 6వేలకు పైగా ఉన్న ట్రాక్టర్ ఇసుక నేడు 3వేలకు దొరుకుతుందని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దాము, మాజీ వైస్ ఎంపీపీ ప్రకాష్ పటేల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

నందిపేట్‌లో శ్రీసీతారామ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఆర్మూర్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ యంత్ర, మూర్తి, శిఖరప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమ య్యాయి. మొదటి రోజున గణపతి పూజ, పుణ్యాహ వచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, గణపతి హోమం, నవ గ్రహ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు యజ్ఞం, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకేధారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠలరావు హాజరై పూజలు నిర్వహిం చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మికతకు నిలయాలు

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి,మే14(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో దేవాలయాలు ఉంటే ఆధ్యాత్మికతకు నిలయాలుగా ఉంటాయని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. సుమారు 30లక్షల వ్యయంతో నిర్మించిన శివాలయాన్ని ప్రారంభించడంతో పాటు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఉన్న చోట శుభం జరుగుతుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలతో నిధులు మంజూరు చేశానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని సూచించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా పరిపాలన చేసిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. రాజులకు గొప్ప పరిపాలన దక్షత ఉంటే ప్రజల చేత ఎన్ని శబ్దాలైన కీర్తించబడతారని అందుకు ఛత్రపతి శివాజీ గొప్ప ఉదాహరణ అని కొనియాడారు. వీరుడి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం శివాలయం ప్రహరి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరగా ఆయన అంగీకరించారు. ప్రహరి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్దిదారులు నిర్మించుకోవాలని సూచించారు, సోంపూర్ గ్రామానికి 58ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇంటికి 5లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం వివిధ దశలలో అందిస్తుందని, లబ్దిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ పవన్, నాయకులు ఏజాజ్ ఖాన్, చాకూర్ గంగాధర్, నాగరాజు గౌడ్, శివరాజ్ పటేల్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ గ్రామ శివారులో 63వ జాతీయ రహదారిపై పట్టణంలోని దోబిగల్లికి చెందిన కొండూర్ నాగార్జున(22), కొండూర్ నరేంద్ర(20) బుధవారం రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. మెట్‌పల్లి మండలం పెద్దపూర్ గ్రామంలోని మేనత్త ఇంటివద్ద గల ఓ ఫంక్షన్ ముగించుకొని బుధవారం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మెట్‌పల్లి వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనం పై గల ఇద్దరు అన్నదమ్ములు నాగార్జున, నరేంద్రలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి కొండూర్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● దోభీగల్లిలో మిన్నంటిన రోదనలు

హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా కొండూర్ నాగార్జున పనిచేస్తుండగా అతడి తమ్ముడైన నరేంద్ర హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును పూర్తి చేశారు. త్వరలో మంచి ఉద్యోగం వస్తుందనుకుంటే మృత్యువు కాటేయడంతో స్నేహితులు , కాలనీవాసులు రోదనలు మిన్నంటాయి. ఐదేళ్ల కిందట భర్తను కోల్పోయిన కొండూరు పద్మ బుదవారం ఇద్దరు కుమారులను కోల్పోవడంతో పలువురికి కన్నీరు పెట్టించింది. దోభిగల్లిలో నివాసం ఉండే ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

రహదారుల వెంట నాటిన బురుగు చెట్లతో ప్రమాదాలు

● బూరుగు చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్న వాహనదారులు


హసాకొత్తూర్ గ్రామశివారులో ఉన్న బురుగు చెట్టు


కాయలు కిందపడి పగిలి బయటపడిన దూదిలాంటి పదార్థం

కమ్మర్‌పల్లి, మే 14: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా రహదారుల వెంట నాటిన బురుగు చెట్లు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. చెట్లుకు కాసిన కాయలనుండి దూదిలాంటి మెత్తటి పదార్థాం బయటకు వచ్చి రహదారుల పైవెలుతున్న వాహనదారుల కళ్లలోపడి ప్రమాదాలకు దారితీస్తున్న సపంఘటనల దృష్ట్యా రహదారులవెంబడి నాటిన బురుగు చెట్లను తొలగించి వాటి స్థానంలో వేరే మొక్కలు నాటించాలని కోరుతున్నారు. ఈ బురుగు చెట్లకు కాసిన కాయలు ఎండలకు పగిలి అందులోని దూది గాలికి ఎగిరి వాహనదారుల కల్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అదీకాక చెట్లు ఎత్తుపెరిగి విద్యుత్ వైర్లకు తాకి గాలిదుమారం వీచిన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి ఈ విషయపై మండలంలోని చౌట్‌పల్లి వద్ద స్థానిక గ్రామపంచాయితి, విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మలు తొగించడంతో అటవిశాఖ స్బిబ్బంది అధికారులతో వాగ్వివాదనికి దిగిన సంఘటన ఇటివల వెలుగు చూసింది. అయితే ఈ బురుగు చెట్లు కమ్మర్‌పల్లి నుండి భీమ్‌గల్ వెళ్లే రహదారులు, జాతీయరహదారి వెంబడి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకశాలు ఉన్నాయని వాటిని తొలగించి వాటి స్థానంలో వేరేరకం మొక్కలు నాటి ప్రమాదాలను నివారించాలని ఆయ గ్రామాల స్థానికు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు జీలుగ విత్తనాల పంపిణీ

ఎడపల్లి, మే14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, సహకార సంఘం ద్వారా 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను నేడు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సిద్ద రామేశ్వర్ తెలిపారు. ఎడపల్లి సహకార పరపతి సంఘం ఎడపల్లి నందు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 30కిలోల బస్తా 4275.00 రూపాయలకు గాను 50 శాతం సబ్సిడీ 2138.00 రూపాయలను ప్రభుత్వం భరించడంతో రైతు ఒక బస్తాకు 2138.00రూపాయలు చెల్లించాలని తెలిపారు. 167 బస్తాలు అందుబాటులో ఉన్నాయని కావలసిన రైతులు తమ పట్టా పాస్‌బుక్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకొచ్చి డబ్బులు చెల్లించి జీలుగ విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు. 5 ఎకరాలకు రెండు బస్తాలు, రెండున్నర ఎకరాలకు ఒక బస్తా మాత్రమే ఇవ్వబడుతుందని రైతులు గమనించాలన్నారు. ఒక రైతుకు రెండు బస్తాలు మాత్రమే పరిమితి ఉందన్నారు.

కోటగిరిలో..

కోటగిరి: మండలంలో రైతులకు గురువారం నుంచి 50శాతం రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు కోటగిరి మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. కోటగిరి, కొత్తపల్లి, ఎత్తొండ సహకార సంఘాలలో ఉదయం 10గంటల నుంచి విత్తనాల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. జీలుగ విత్తనాలు 30కిలోల బస్తా 4275రూపాయలు కాగా 50శాతం సబ్సిడీ పోనూ 2138రూపాయలు రైతులు చెల్లించాలని ఆయన సూచించారు. కోటగిరిలో 100బస్తాలు, కొత్తపల్లిలో 30బస్తాలు, ఎత్తొండలో 30బస్తాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు అవసరమైన రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు తీసుకువచ్చి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

నవీపేటలో..

నవీపేట:నవీపేట సొసైటీలో గురువారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ అబ్బన్న తెలిపారు. నవీపేట సొసైటీలో 333 సంచుల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 30కిలోల బరువు ఉన్న ఒక్కొక్క జీలుగ బస్తాను 50శాతం సబ్సిడీతో రూ.2137.50లకు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణానికి ఒక బస్తాను అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్ జిరాక్స్‌ను వెంట తీసుకువచ్చి జీలుగ విత్తనాలను పొందాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు అందజేత


ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

కోటగిరి,మే14(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీవో చందర్‌కు తమ సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోవాలని జీపీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి లింగం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 20వ తేదిన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నన్నేసాబ్, రజిని, లింగవ్వ, సాయవ్వ, లక్ష్మీ, నాగమణి పాల్గొన్నారు.

గుండెపోటుతో యువరైతు మృతి

ఆర్మూర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం బాద్గుణ గ్రామానికి చెందిన యువరైతు గోడిసెర తిరుపతిరెడ్డి (38) బుదవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం తన ఇంటివద్ద నీటిడ్రమ్మును కడుగుతున్న సమయంలో గుండె పోటు రావడంతో కుప్పకూలీ పడిపోయాడు. కుటుంబ సభ్యులు వచ్చి గమనించగా అప్పటికే తిరుపతిరెడ్డి మృతిచెందాడు. కొన్నేళ్ల క్రితం ఆయన కూతురు స్కూల్‌బస్సు కిందపడి మృతిచెందింది. ఈయనకు భార్య , పిల్లలు ఉన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నవీపేట,మే14(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం వంటి వివిధ సంక్షేమ పథకాలపై అధికారులకు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లుకున్న పచ్చదనం


వేల్పూర్ వెళ్లే రోడ్డులో సాయిబాబా ఆలయం వద్ద అల్లుకున్న వృక్షాలు

వేల్పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామ సమీపంలో సాయిబాబా ఆలయం వద్ద ఆర్మూర్, భీమ్‌గల్ వెళ్లే రహదారుల్లో రెండువైపుల నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా ఎదిగాయి. రోడ్డుకు రెండు దిక్కుల నుంచి చెట్లకొమ్మలు అల్లుకుపోవడంతో అహ్లాదకరంగా మారి పచ్చని తోరణంల కనబడుతుంది. ఈ దృశ్యం రోడ్డున వెళ్లే వాహనదారులను ఆకట్టుకుంటుంది. ఈ దృశ్యాన్ని చూసిన వారు తమ ఫోన్‌లలో బంధించుకుంటున్నారు. దారిపొడవున ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు చల్లని నీడ ఉండడంతో ప్రయాణీకులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి కాసేపు ఆగి సేదతీరుతున్నారు.

మార్కెట్ యజమాని ఖాదర్‌యూసిఫ్‌ను కలిసిన డైరెక్టర్లు

జక్రాన్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం ప్రపంచ ప్రఖ్యాత రిటైర్డ్ మార్కెట్‌కు చెందిన లల్లుమార్కెట్‌ను జేఎంకేపీఎం డైరెక్టర్లు సందర్శించారు. అనంతరం ప్రధాన మేనేజర్ ఖాదర్‌యూసిఫ్‌ను కలిసిన జేఎంకేపీఎం చైర్మన్ తిరుపతిరెడ్డి, గౌవర అధ్యక్షుడు ములుగు హిమగిరి రావు కలిశారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘంలో విలువ ఆధారిత పసుపును లల్లుమాల్ ద్వారా మార్కెటింగ్ చేసే అవకాశం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఖాదర్‌యూసిఫ్ రైతులు తయారు చేసే వస్తువు నాణ్యమైనదిగా ఉంటుందని ఈ విషయాన్ని యజమానికి వివరించి త్వరలో రైతుల ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను సందర్శించిన నిర్ణయం తీసుకుంటామని రైతులు పండించిన పసుపు ద్వారా తీసిన కల్తీలేని నాణ్యమైన పసుపు పౌడర్‌ను కొనడానికి త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఖదర్ యూసఫ్ భరోసా ఇచ్చారని జేఎంకేపీఎం చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

బాల్కొండలో రైతులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రమ్యరాథోడ్

బాల్కొండ, మే 14(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రుర్ ప్రాంతీయ వరిపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్యరాథోడ్ రైతులకు పలు అంశాలపై శాస్త్రీయ మార్గదర్శనం చేశారు. పంటల సాగులో యూరియా, రసాయనిక ఎరువుల తక్కువ వినియోగం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, అవసరమైన సమయంలో సూచించిన మోతాదులో పురుగుమందులను వినియోగించాలని దీనివల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పంట మార్పిడి విదానం ద్వారా నేల సారాన్ని మెరుగుపర్చడంతో పాటు పర్యావరణ సమతూల్యత సాధ్యమవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి, వ్యవసాయాధికారిణి లావణ్య, డాక్టర్ లక్కం ప్రభాకర్, సతీష్, రేష్మ, నిహారిక, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

● అఖిల భారత ఐక్యరైతు సంఘం నాయకుల డిమాండ్


అర్గుల్‌లో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

జక్రాన్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రధాన రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పేరుకుపోయాయని తక్షణమే ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని అఖిలభారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర నాయకుడు వి. ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అర్గుల్, సికింద్రాపూర్ గ్రామాలలో ఎటుచూసిన రోడ్లపై నిల్వఉన్న ధాన్యం కుప్పలను అఖిలభారత ఐక్యరైతు సంఘం ప్రతినిధులు, నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటి ప్రతినిధులు వి. ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. దేవరాం, కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు బాబాన్న, నాయకులు డి. కిషన్, వాల్గోట్ సాయిలు, గంగారాం, బాలయ్య ఈ గ్రామాలలో పర్యటించి ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాల న్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కురుస్తున్న అకాల వర్షాలకు తడిసి ముద్దయితున్నాయని, వర్షపు నీటి కాలువలలో ధన్యం కొట్టుకుపోతుందని అన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున రైతుల తరపున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జగదీష్, గంగారాం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

రెంజల్,మే14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిన్షియల్ పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు బాలికల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్షియా నాజం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ దరఖాస్తులను జూన్ 1వ తేది వరకు, 5వ తరగతి ప్రవేశాలకు మే 31వరకు చివరి తేది అని, దరఖాస్తులతో పాటు విద్యార్థిని, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోర్టులు, ఆదాయ, కుల ధ్రువపత్రాలు, టీసీ, ప్రోగ్రెస్ కార్డు, బోనోఫైడ్, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జత పర్చాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మగ్గిడి ఎత్తిపోతల కమిటీ నూతన కార్యవర్గం

ఆర్మూర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని మగ్గిడి, ఖానాపూర్, అమ్దాపూర్ గ్రామాలకు చెందిన రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం నూతన కమిటీని బుదవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బద్దం నాగరాజు, వైస్ చైర్మన్‌గా తొడుశెట్టి సుమన్, కోశాధికారిగా అశోక్, కార్యదర్శిగా నలిమెల చిన్నారెడ్డి, డైరెక్టర్లుగా భూమారెడ్డి, దినేష్, రాజేశ్వర్, రాజన్న, నర్సయ్య ఎన్నిక కాగా వారు ప్రమాణ స్వీకారం చేశారు.

సొంతంగా ఆలయం నిర్మించుకోవడం అభినందనీయం


మాజీ జడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటి సభ్యులు

ఆర్మూర్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రం లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో భక్తులు, కాలనీవాసులు, గ్రామస్థులు సొంతంగా ఆలయం నిర్మించుకోవడం అభినందనీయమని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజన్నగారి విఠల్ రావు అన్నారు. బుధవారం నందిపేట్‌లో శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠమహోత్సవానికి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆలయాలకు ఎండోమెంట్ ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందని కానీ శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు ఎండోమెంట్ నుంచి ఏమి ఆశించకుండా సొంతంగా డబ్బులు జమచేసుకుని ఆలయ నిర్మాణం పూర్తిచేసుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా దాదన్నగారి విఠల్‌రావును ఆలయ కమిటి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, సిలిండర్ లింగం, మచ్చర్ల సాగర్, వార్డుమెంబర్ భూమేష్, ఎలిగేటి రాజు, మంద సాయన్న, నారాయణ పాల్గొన్నారు.

బెజ్జోర ఆలయంలో ఇటాలీ సైనికుల బ్యాడ్జీలు లభ్యం

భీమ్‌గల్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర గ్రామంలో ఉన్న పురాతన బెజ్జమహాదేవి ఆలయంలో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ఇటాలీ దేశానికి చెందిన సైనికుల బ్యాడ్జీలు లభ్యమైనట్లు ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కంకనాల రాజేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఒక పక్కన పెట్టిన ఉన్న రెండు బ్యాడ్జీలను గుర్తించారు. అవి ఇటాలీయన్ సైన్యంలోని కెప్టెన్‌ల బ్యాడ్జీలని ఒకటి (ఆర్డినరి రెజిమెంట్ ఫిట్ హెల్మెంట్)గా, రెండోది (ఇటాలి బెటాలియన్ ఆర్మీక్యాంప్ బ్యాడ్జి)గా గుర్తించారు. తెలం గాణ రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఈ ఆలయాన్ని సందర్శించి వివ రాలు సేకరించి ఈ బ్యాడ్జీలను మ్యూజియంలో భద్రపరచాలని ఆయన కోరారు.


బెజ్జోర ఆలయంలో లభ్యమైన ఇటాలీయన్ బ్యాడ్జీలు


చెట్టు కింద సేద తీరుతున్న గొర్రెలు, మేకలు

ఎండకు అల్లాడుతున్న మూగజీవాలు

● వడదెబ్బ తగిలే అవకాశం

● అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారుల సూచన

డొంకేశ్వర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండలో ముదురుతున్నాయి. ఎండ తీవ్రతను మనుషులే కాకుండా మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న మనుషులకు ఎండదెబ్బ తగులుతుంది. అలాంటిది బయట మేతకోసం పశువులు గొర్రెల మేకలతో పాటు పక్షులు ఎంత అల్లాడుతున్నాయో చెప్పనక్కర్లేదు. మేత కోసం అడవికి వెళ్లిన పశువులు గొర్రెలు, మేకలకు వాగులు చెరువుల్లో నీరు అడుగంటి బోసి పోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండ ప్రభావంతో చెరువుల నీళ్లు వేడెక్కి ఉంటాయి. అవే నీటిని పశువులు తాగుతాయి. ఎండ కాలంలో తీవ్రమైన ఎండల వల్ల పశువులు అధిక వేడి తాపానికి గురై ఉత్పాదక శక్తి కోల్పోవడమే కాకుండా కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. దీంతో పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని పశు వైద్య అధికారులు సూచిస్తున్నారు. డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా గేదెలు 5500, ఆవులు 700, గొర్రెలు 17000, మేకలు 5500 ఉన్నాయి. వేసవిలో తప్పనిసరి పశువులకు మూగజీవాల పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ పశువులు, గొర్రెలు, మేకలు ఎండ ప్రభావానికి ఎండదెబ్బకు గురై వాటి శరీరం వేడిగా పొడిబారి ఉంటుంది. వెంటనే తడిబట్టతో తుడవాలి లేదా తడి బట్టతో కప్పి ఉంచాలి. ఆరోగ్యం క్షీణిస్తే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి వైద్యం అందిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలి ..

పశువులు మూగజీవాలకు వేసవిలో రెండు పూజలా నీటిని తాగించాలి. సుమారు రోజుకు 50 లీటర్ల వరకు నీటిని తాగించాలి. పుష్కలంగా నీరు తాగించడం వల్ల డిహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడుకోవచ్చు. నీరుతో పాటు పచ్చిమేత అందించాలి. పంటచేలకు వెళ్లే పశువులు మధ్యాహ్నం సమయంలో చెరువులు కుంటలో నీరు తాగించడం మంచిది కాదు. ఎండ వేడికి నీరు వేడెక్కి ఉండటంతో వేడినీరు తాగడం వల్ల మూగ జీవాలు పశువుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. చల్లని నీటిని మాత్రమే తాపాలి. ఎండవేడికి కొట్టాలలో చెట్ల నీడన సేదతీరే విధంగా చూడాలి. గొర్రెలు, మేకలు, గేదెలు , ఆవుల ఎక్కువగా ఎండలో తిప్పకూడదు. వీలైనంత వరకు చల్లని ప్రాం తాల్లో నీడ పట్టున ఉంచాలి. ఇంటి వద్ద రేకుల షెడ్డు ఉన్నవారు పైన వరి గడ్డి ఉంచితే వేడి ప్రబావం తగ్గుతుంది. పశువులకు పచ్చిమేత ఎకుకవగా ఇంటివద్ద అందించేలా ఏర్పాటు చేసు కోవాలి. బయటకు తీసుకెళ్లడం త్పనిసరి అయితే ఉదయం 6 నుంచి సాయంత్రం 10 గంటల లోపు తీసుకెళ్లాలి. మళ్లీ సాయంత్రం 5 దాటిన తరువాత మరోసారి మేతకు తీసుకువెళ్లాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

● శ్రీకాంత్, పశువైద్యాధికారి, డొంకేశ్వర్



ప్రస్తుతం గతంలో ఎన్నడు లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న ఎండల తీవ్ర తతో వివిధ పశువుల పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలి. సరైన సమయంలో నీరు పశుగ్రాసం అందించేలా చూడాలి. పశువుల చుట్టూ చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు
తాడ్‌బిలోలి విద్యార్థుల ఎంపిక

రెంజల్, మే 14 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా చాంపియన్-2025 రూపొందించిన తెలంగాణ క్రీడ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీలు జనగామలో నిర్వహించనున్న పోటీలకు తాడ్‌బిలోలి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నయనశ్రీ, అక్షయ, శృతి, అమర్, మహేష్ విద్యార్థులు పోటీలలో ఈ నెల 15నుండి 17వ తేది వరకు నిర్వహించే స్టేట్ లెవెల్ పోటీలలో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ తెలిపారు. స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రేఖతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


చెరువు ముందర తండా రహదారి ఇదే


శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం


కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణం కోసం తీసుకువచ్చిన పైప్‌లు వృథాగా ఉన్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఏళ్లు గడుస్తున్నా..
ముందుకు సాగని రహదారుల నిర్మాణం

● ఫారెస్టు క్లియరెన్స్ రాదు.. రోడ్డు నిర్మాణం జరగదు ● మారుమూల తండాల రహదారులను పట్టించుకోని అధికారులు, పాలకులు

నిజాంసాగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన తండాల రహదారుల నిర్మాణాలకు ఫారెస్ట్ క్లియరెన్స్ రాకపోవడంతో తండాల రహదారుల నిర్మాణం ఏళ్ల గడుస్తున్నా ముందుకు సాగటం లేదు. ఫారెస్ట్ అధికారులు ఫారెస్ట్ హద్దులను ముందుగానే నిర్ధారణ చేసుకున్నప్పటికీ రహదారుల నిర్మాణం పనులు శ్రీకారం చుట్టిన పనులు ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. ఫలితంగా లక్షల రూపాయలు మంజూరు చేసినా ప్రభుత్వం రహదారి నిర్మాణాల వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిజాంసాగర్ మండలం, వడ్డేపల్లి శివారు గ్రామమైన చెరువు ముందర తండాకు వెళ్లే ప్రధాన రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు 2017లో తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా నిధుల కిందట 78 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టేందుకు అప్పట్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. ఈ నిర్మాణం నిజామాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులను చేజిక్కించుకున్నారు. ప్రధాన రహదారి నుంచి దాదాపు 2.5 కిలోమీటర్ల దూరం రహదారిని ఫార్మేషన్ చేయడంతో పాటు వీటిలో నిర్మాణం కూడా చేసేందుకు అగ్రిమెంట్ పూర్తి చేసుకున్నారు. ఈ రహదారి పనులు చేపట్టేందుకు పంచాయతీరాజ్ అధికారులు అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా శంకుస్థాపన చేయించారు. 2017లో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణానికి పైపులతో పాటు ముడి సరుకులు కూడా సమకూర్చుకున్నారు. రహదారిని వెడల్పు చేసేం దుకు కాంట్రాక్టర్ అడవి జాతుల చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేసేందుకు పనులను ప్రారంభించారు. ఈ రహదారి అటవీ సరిహద్దులో ఉందంటూ అటవీశాఖ అధికారులు అడ్డు తగిలి పంచాయతీరాజ్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేశారు. అటవీ అనుమతులు లేనిది పనులు చేయరాదంటూ నోటీసులో హుకుం చేశారు. దీంతో పనులు చేపట్టే కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. 2017 నుండి 2025 వరకు ఫారెస్ట్ క్లియరెన్స్ రాకపోవడంతో రహదారి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. మల్లూరు ప్రధాన రహదారి నుంచి చెరువు ముందర తండాకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో తండావాసులు అనేక పాట్లు పడుతున్నా పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పాపాన పోవటం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం పాలనా పరిపాలన నిధుల కిందట 78 లక్షల రూపాయలు కేటాయించిన రోడ్డు నిర్మాణం పనులను ముందుకు సాగడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నారని తండావాసులు ఆరోపిస్తూ ఉన్నారు. రహదారి నిర్మాణానికి 2017లో పంచాయతీరాజ్ మంత్రి వేసిన శిలాఫలకాన్ని రోడ్డు నిర్మాణం జరగటం లేదని ఆగ్రహంతో ప్రజలు శిలా ఫలకాన్ని ధ్వంసం చేశారు రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణానికి తీసుకువచ్చిన పైపులు రహదారి వెంటనే నిరు పయోగంగా పడి ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా గిరిజన తండా రహదారికి ఫారెస్టు క్లియరెన్స్ వచ్చేనా రహదారి నిర్మాణం జరి గినా నీ ప్రశ్నర్థకంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధి కార యంత్రాంగం గిరిజన తాండాల రోడ్డు నిర్మాణం పనులను చేప ట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెట్టి చాకిరి ఇంకెన్నాళ్లు!?

● 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రతిపాదికన కొనసాగుతున్న రెండో ఏఎన్‌ఎంలు

● చాలీచాలనీ జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్న వైనం ● రెగ్యులరైజ్ కోసం ఎదురు చూపులు

నసురుల్లాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రతిపాదికన పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఉద్యోగ భద్రత లేక చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. దశలవారీగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాల్సి ఉండగా పట్టించుకునే వారే కరువయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఆరోగ్య ఉప కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో రెండో ఏఎన్‌ఎంలను కాంటాక్టు పద్ధతిన నియమించారు. నాటి నుంచి 20 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు రెండో ఏఎన్‌ఎంలు రాష్ట్ర జిల్లా స్థాయిలో నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వాలు మాత్రం స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు గ్రామాలు ఉంటే రెండు గ్రామాలు రెగ్యులర్, మరో రెండు గ్రామాల బాధ్యతలను కాంట్రాక్టు కేటాయించారు. కాగా వీరి మధ్య వేతన వ్యత్యాసం చాలా ఉంది. తమకు నెలకు అందిస్తున్న 28 వెల రూపాయల వేతనం సరిపోవడం లేదని, రెండో ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించి, రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.


ఇంటికెళ్లి బాలింతలకు వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


గర్భిణుల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది


మిర్జాపూర్‌లో వైద్య సేవలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం

● ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలి



ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారు లు స్పందించడం లేదు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు మమ్మల్నీ గుర్తించి రెగ్యులర్ చేయాలి.

- శిరీష, ఏఎన్‌ఎం, మిర్జాపూర్

● సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



కాంట్రాక్టు రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అవి అమలు కావడం లేదు. కనీసం సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

- స్రవంతి, ఏఎన్‌ఎం, నెమ్లి

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

● గ్రామాల్లో సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ● సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు ● పర్యవేక్షించని ఉన్నతాధికారులు


పొందుర్తి మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం




శివాయిపల్లి గ్రామంలో మురికికాలువల దుస్థితి

రాజంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని అనేక గ్రామాల్లో సమస్యలతో ప్రజలు సతమతమవు తున్నారు. మండలంలోనే పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వేసవి కాలం వచ్చిందంటే గ్రామాల్లో మంచినీటి కొరత ఉండడం సహజమే అయినప్పటికీ కొన్ని గ్రామాల్లో అన్ని సౌకర్యాలు ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీళ్లు అందడం లేదు. మధ్యాహ్నం దాటితే పలువురు పంచాయతీ కార్యదర్శులు అసలు గ్రామపంచాయతీ పరిధిలో కనిపించడం లేదని పేర్కొంటున్నారు. సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్న పట్టించుకోకపోవడంతో సిబ్బంది తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని దీంతో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అటకెక్కిన పారిశుధ్య నిర్వహణ

మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. పారిశుధ్య పనులు చేపట్టిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించక పోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుంది. నిర్వహణలోపించడంతో గ్రామాల్లో మురుగు ఏరులై పారుతుంది. ఒకప్పుడు వార్డులలో పెంట కుప్పలు ఉండడంతో ఈదురుగాలలు వచ్చినప్పుడు ఇండ్లలోకి చెత్త వచ్చేదని ఇప్పుడు డంపింగ్‌యార్డు ఉన్న కొన్ని వార్డులలో పెంటకుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామపంచాయతీ ట్రాక్టర్లు సమయానికి రాకపోవడంతో ఇంట్లో ఉన్న చెత్త వీధుల్లో పెద్ద కుప్పలల్లో వేస్తున్నారు. మండలంలోని శివాయిపల్లి, పొందుర్తి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మురికికాలువలు, చెత్తచెదారంతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. గ్రామాల్లో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో మురికికాలువలు శుభ్రం చేయకపోవడంతో గడ్డిఏపుగా పెరిగి అందులో దోమలు ప్రమాదకరమైన విషపురుగులు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు

గ్రామాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన పలువురు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని ఏదైన పని కోసం గ్రామస్తులు కార్యాలయానికి వస్తే అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ ఫోన్ ద్వారా సంప్రదిస్తే మండల కార్యాలయంలో పనుల కోసం వచ్చామని చెబుతున్నారని వాపోతున్నారు. మధ్యాహ్నం దాటితే కార్యాలయంలో ఏ ఒక్క పంచాయతీ కార్యదర్శి ఉండడంలేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో సమస్యలు ఏర్పడితే సర్పంచ్‌లు లేకపోవడం వల్ల ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులను కలిసేందుకు వెళ్తే కారోబార్‌లు ఉండడం వారు తమకు అంతగా తెలియదని సమాధానం ఇస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం వచ్చి రెండు గంటలు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కార్యదర్శుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడంతోనే ఎవరికి నచ్చినట్లుగా వారు వ్యవహరిస్తున్నారని దీంతో ప్రజాసమస్యలు తీరడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం..

● రఘురాం, ఎంపీడీవో, రాజంపేట



మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం. ప్రతిరోజు మురికికాలువలను శుభ్రం చేయిస్తున్నాం. ఎవరైనా పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతిరోజు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి. గ్రామాల ప్రజలకు ఏమైన ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

తిమ్మాపూర్‌లో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


గంగమాత విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

మోర్తాడ్, మే 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం గంగమాత దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన పూజా వైభవంగా జరిగింది. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు ఎండోమెంట్ ద్వారా మంజూరు చేయించారు. పూర్తయిన ఆలయానికి విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌలాస్ రిజర్వాయర్‌లో చేపల పట్టేందుకు వేలం

● నాలుగు లక్షల 40 వేల రూపాయల వేలం


చేపలు పట్టేందుకు వేలం పాట నిర్వహిస్తున్న జిల్లా అధికారి

నిజాంసాగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టులు చేపలు పట్టుటకు బుధవారం నిజాంసాగర్ మండలం అచ్చంపేట చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆవరణలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలంలో నాలుగు ఏజెన్సీలు పాల్గొన్నాయి. నాలుగు లక్షల నలభై వేల రూపాయల వేలం పాట పాడి ఎండి జాఫర్ కైవసం చేసుకున్నారు. రిజర్వాయర్లో వేలం పాటలు పొందిన వ్యక్తి తాలూకు చెందిన వారే చేపలు పట్టడం జరుగుతుందని డీఎఫ్ఓ శ్రీపతి తెలిపారు. రిజర్వాయర్లు ఇతరులు ఎవరైనా చేపలు పట్టినట్లయితే వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ వేలం పాటలు జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకే నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ వేలం పాటల్లో నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్ర నిర్వాహణాధికారి టోల్ సింగ్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉదయమే పని ప్రదేశానికి చేరుకోవాలి


గొట్టిముక్కులలో ఉపాధిహామీ కూలీల మాస్టర్ పరిశీలిస్తున్న ఏపీవో

దోమకొండ, మే 14(ఆంధ్రజ్యోతి):ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం 6.30 గంటల వరకే పని ప్రదేశానికి చేరుకోవాలని ఏపీవో రజని అన్నారు. బుధవారం మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. మస్టర్‌లోని హాజరు, మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటోలను కూలీల పేరుతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 6.30 గంటల నుంచి 10.30 వరకు పనులు చేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే అంతే డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కే. అంజాగౌడ్, సహాయకులు శేఖర్, రాజు, నత్తి శేఖర్, కూలీలు పాల్గొన్నారు.

పోసానిపేట్‌లో కుంభాకార దర్పణం


కుంభాకార దర్పణం ఏర్పాటు చేసుకున్న గ్రామస్థులు

రామారెడ్డి, మే 14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో బురోడ్డు మూల మలుపుల మధ్య మెయిన్‌గా హరిజనవాడ మూల మలుపు, రామారెడ్డి అడ్డం రోడ్ దగ్గర పెట్టించడం జరిగిందని ఎస్సై ఎస్. రాజారాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి పరిరక్షణకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. 2011 - 2012 పదవ తరగతి బ్యాచ్ సభ్యులు సహకరించారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిలు, రాజకీయ నాయకులు, స్నేహితులు రామకృష్ణ రెడ్డి, శ్రీకాంత్, రాజేశ్వర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నవీన్, దయాకర్ రెడ్డి, బాలరాజు విద్యార్థినులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సిద్దరామేశ్వర ఆలయ ఎలక్ట్రీషియన్ సస్పెన్షన్

భిక్కనూరు, మే 14(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ ఎలక్ట్రీషియన్ లక్ష్మీనారాయణను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడం జరిగిందని ఈవో శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మా ట్లాడుతూ ఆలయ హుండీ లెక్కింపు సమయంలో ఎలక్ట్రీషియన్ డబ్బులను దొంగిలించగా విచారణ చేసి ఉన్నతాధికారుల ఆదేశాలతో సెస్పెండ్ చేశామన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మండల అధ్యక్షుడు

ఎల్లారెడ్డిరూరల్,మే 14(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిమండల పరిధిలోని మలయ్యపల్లి గ్రామంలో రూ.15లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించినట్లు మండల అధ్యక్షుడు కురుమసాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక చొరవతో రూ.15లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులను గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరుచేశారని తెలిపారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తేవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రజితవెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు అశోక్, సీనియర్ నాయకుడు వెంకన్న,దత్తు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం

రాజంపేట,మే14 (ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామంలో బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం రమేష్ బాబు పరిశీలించారు. కొనుగోలుకేంద్రంలో ఇప్పటివరకు 69మంది రైతులు 6558 బస్తాలు, 26 23 క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లుకు పంపించడం జరిగిందని తెలిపారు. ట్యాబ్ ఎంట్రీ చేయడంతో పాటు, మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజేందర్, సాయి లు, అధ్యక్షురాలు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి


బస్వాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

భిక్కనూరు,మే14(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులు సకాలంలో నిర్మాణ పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎవరు ఆందోళన చెద్దవద్దని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైనా ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయ్యడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు సిద్దరాములు,ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు జీవన్, తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్, కార్యదర్శి దయాకర్, నాయకులు లింబాద్రి, సుదర్శన్, తుడుం స్వామి, ఎల్లం, చందు, బాబు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి మండలంలోని కాకులగుట్ట తండాలో బుధవారం కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నౌసిలాల్ నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైనా వారందరీకి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు భుక్యా శంకర్‌నాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి,యువజన విభాగం అధ్యక్షుడు రవీందర్, నాయకులు రవి,గణేష్,చందర్,నరేష్, ప్రకాష్, సలీం, జీపీ కార్యదర్శి కృష్ణ,పాల్గొన్నారు

ఎల్లారెడ్డిరూరల్:ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జానకంపల్లి,కుర్దుగ్రామంలో ఇందిరమ్మ ఇండ్లలబ్ధిదారులకు బుధవారం ఎంపీడీవో ప్రకాష్ నిర్మాణపత్రాలు అందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో లబ్ధిదారులు ప్రారంభించిన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ సందీప్,కాంగ్రెస్‌నాయకులు సంతోష్‌నాయక్,సాయిలు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి అపర్ణ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వులు అందినవారు వెంటనే ప్రభుత్వం సూచించిన కొలతలో ఇల్లు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఈపథకం ద్వారా పేద వాళ్ల ఇంటి కల సాకారం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, పంచాయతీకార్యదర్శి,ఇందిరమ్మకమిటి సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకొండ:మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు అధికారులు కొలతల ప్రకారం ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంకు మొదటి విడతలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

సజావుగా జొన్న కొనుగోలు ప్రక్రియ


జొన్నల తేమశాతం పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం మహేష్.

పెద్ద కొడప్‌గల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో జొన్నలను ఎలాంటి ఆటంకం లేకుండా కొనుగోలు సజావుగా చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ తెలిపారు. బుధవారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా నిర్వహిస్తున్న జొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎం మహేష్ మాట్లాడుతు జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోలు పక్రియ సజావుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాలలో రైతులందరికి గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, జొన్నలను తరలించడానికి లారీల కొరత లేదన్నారు. ఇక జొన్నలను తరలించే విషయంలో రైతులు లారీ డ్రైవర్లకు ఎలాంటి డబ్బులు ఇవ్వరాద ని సూచించారు. జుక్కల్ నియోజక వర్గంలో పెద్ద కొడప్‌గల్ పరిధిలో జొన్నలు అధికంగా పండినందున ఈ కేంద్రం ద్వారా కొనుగోలు పూర్తి చేయిస్తున్నామన్నారు. మూడు రోజులలో పెద్ద కొడప్‌గల్ సెంటర్‌లో జొన్నలు కొనడం పూర్తి చేస్తామని, ఇంక ఎవరైనా రైతుల వద్ద జొన్నలు ఉంటే కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చి తూకం వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, సీఈవో సందీప్, ఏఈవో రూప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం

రామారెడ్డి, మే 14 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రంలో విద్యార్థిని, విద్యా ర్థులకు సెలవులు ఉన్నందున సమ్మర్ క్యాంపును పిఇటి బాలరాజు నిర్వ హించారు. బుధవారం పిల్లలకు ఫుట్బాల్ నేరిఁచడం జరుగుతున్నందున వారికి ప్రోత్సహం ఇవ్వడానికి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్ గుప్తా ఫుట్బాల్‌ను బహుకరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రామారెడ్డి ఫుట్బాల్‌కు పేరు ప్రత్యేకతలు కలదు. రామారెడ్డి గ్రామంలో చాలా మంది క్రీడాకారులు ఫుట్బాల్లో స్టేట్ లెవెల్, ఇంటర్నేషనల్ లో ఆడడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పిఈటీ బాలరాజు, గుర్జగుంట స్వామి, గణేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో భక్తుల పూజలు


ఆలయంలో అన్నప్రసాద వితరణ చేపడుతున్న దృశ్యం

బాన్సువాడటౌన్,మే 14(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం భక్తులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకం, అర్చనలు చేపట్టారు. నూతన వస్త్రాలతో స్వామి వారిని అలంకరించారు.భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ గావించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

ఆగం చేసిన అకాలవర్షం


మహమ్మద్‌నగర్‌లో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

మహమ్మద్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి):మహమ్మద్‌నగర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రాత్రి కురిసిన భారివర్షం రైతులను ఆగం చేసింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరిధాన్యంలోకి నీరు వచ్చిచేరడంతో వాటిని తొలగించేందుకు అనేక ఇబ్బందులను ఎదుర్కోన్నారు.

హరీష్‌రావు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

● మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి

రామారెడ్డి, మే 14 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడవద్దని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని బుధవారం రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు.ఎమ్మెల్సీ కవిత సీఎం సీటు కోసం కొట్లాడితే, కేటీఆర్ పార్టీ పగ్గాలు చేపట్టడంతో, మతిస్థిమితం చెంది నోటికొచ్చినట్టు మాట్లాడటం హరీష్ రావుకు తగదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవిని అనుభవించి, కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు నీకు లేదని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ముగ్గురు నాటకాలతో బీఆర్ఎస్ శ్రేణులు అయోమయానికి గురి అవుతున్నారు. త్వరలో బీఆర్ఎస్ రాజకీయం దుకాణం మూతపడు తుందని, ఆరిపోయే దీపాన్ని పట్టుకొని ప్రగల్భాలు పలకవద్దని హరీష్ రావుకు హితవు పలికారు.

డోంగ్లిలో ఇసుక టిప్పర్ పట్టివేత


పట్టుబడిన ఇసుక టిప్పర్

మద్నూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహన టిప్పర్‌ను రెవెన్యూ సిబ్బంది పట్టుకొని మద్నూర్ పోలీసులకు అప్పగించారు. బుధవారం తెల్లవారుజామున పోతంగల్ నుంచి ఎటువంటి అనుమతులు, ధ్రువపత్రాలు లేకుండా కర్ణాటకకు తరలి వెళ్తున్న ఇసుక టిప్పర్ డోంగ్లి మండలంలో పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. ఇటీవల మూడు టిప్పర్లను, ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు వెల్లడిం చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గాంధారి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దీలిప్‌రావు, బోరంచ సాయిలు, మేడిపల్లి తదితర గ్రామాలలో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు. బీఆర్ఎస్ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఎంపీటీసీ పత్తిశ్రీను, బలరాంనాయక్, రెడ్డిరాజు,మల్లేష్‌యాదవ్, సాయిలు,తూర్పుసంతోష్, ముస్తాప,సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మహిళ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డిరూరల్,మే 14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని సాతెల్లి గ్రామంలో వరుసదొంగతనాలకు పాల్పా డిన మహిళను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. సాతెల్లి గ్రామానికి చెందిన నీరడి మంజుల (45) ఎల్లారెడ్డి పట్టణంలోని మార్కెట్‌లో దొంగతనానికి సంబంధించిన ఆభరణాలు అమ్మేందుకు రావడంతో ఆమెను పట్టుకున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3న గ్రామానికి చెందిన పసుపు అనిత యాదగిరిగుట్ట దైవదర్శనానికి వెళ్ల గా ఆమె ఇంట్లో ఉన్న బంగారు కమ్మలు, ముక్కుపుడక చోరికి గురైందని, మే 9 న దుద్దిల దురయ్య ఇంట్లో 5 తులాల వెండి కడియంతో పాటు రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారని, మంగలికిషన్ ఇంట్లో అదేరోజు 20 తులాల వెండి పట్టీలు, ఒక జత బంగారు చెవికమ్మలు రూ.13 వేల నగదు దొంగతనానికి గురైందని ఫిర్యాదులు రావడం విచారణ చేపట్టామని తెలిపారు. విచారణలో మంజుల దొంగతనానికి పాల్పడిందని గుర్తించి విచారించగా చేసిన దొంగతనాలను ఒప్పుకుందని తెలిపారు.ఒక జతబంగారు కమ్మలు,20 తులాల వెండి పట్టీలు, 5 తులాల వెండి కడియం, 12 వేల నగదు స్వాధీనం చేసుకుని నిందితురాలిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, కానిస్టేబుల్ ఇద్రిస్, హోంగార్డు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పెళ్లికి సహాయనిధి కల్యాణ లక్ష్మి పథకం


షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్, మే 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆడపిల్ల పెండ్లికి ఆర్థికంగా ఆదుకునేందుకే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అమలు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ దశరథ్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతు పేదింట్లో పెండ్లి జరిగితే ఎన్నో ఇబ్బందులు ఎదురౌతాయని, దీంతో పాటుగానే ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతాయని, అటువంటి పరిస్థితిని అధిగమించడానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అమలు చేస్తు న్నామన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రుక్మిణి విఠలేశ్వర కల్యాణం


భైరాపూర్‌లో ధ్వజ స్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

బీర్కూర్, మే 14 (ఆంధ్రజ్యోతి):బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామంలోని రుక్మిణి విఠలేశ్వర ఆలయంలో ధ్వజస్థంభం పునఃప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం గతమూడు రోజులుగా కొనసాగుతుంది.ఇందులో భాగంగా బుధవారం ఆలయ సన్నిధిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభం పునఃప్రతిష్టించారు.ఇదిలా ఉండగా ఆలయ సన్నిధిలో రుక్మిణివిఠలేశ్వర కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రో చ్చా రణల మధ్య కల్యాణం నిర్వహించారు.అనంతరం ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అలాగే ఆలయ సన్నిధిలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం కొనసాగుతుంది.

సమయమైనా.. కనిపించని వ్యవసాయాధికారులు


ఉదయం 11దాటినా తెరుచుకోని వ్యవసాయాధికారి కార్యాలయం

మహమ్మద్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం బుధవారం ఉదయం 11గంటలైన తెరుచుకోలేదు. మండలంలోని కోమలంచ గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు ఆటోలో వచ్చి ఉదయం 9 గంటల నుండి వ్యవసాయ కార్యాలయం వద్ద అధికారుల కోసం పడిగాపులు కాస్తు కూర్చుంది. వరికొనుగోలు కేంద్రంలోని ట్యాబ్‌లో తన భూమికి సంబంధించిన రికార్డు చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమస్య పరిష్కారం కోసం అధికారుల కోసం వస్తే కార్యాలయం ఇంకా తెరుచుకోలేదని వాపోయింది. సమయపాలన లేని అధికారులపై నిఘా ఉంచాలని ఉన్నతాధికారుల తగిన విధంగా స్పందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది


ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న డిపోమేనేజర్

బాన్సువాడటౌన్ , మే 14 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ - హైదరాబాద్ వెళ్లిన బస్సులో బుధవారం ఓ ప్రయాణీకుడు ఎంజీబీఎస్ బస్టాండ్‌లో 50 వేల రూపాయల బ్యాగ్‌ను మరచిపోయాడు. ప్రయాణీకుడు వెంటనే డిపో మేనేజర్ సరితాదేవికి ఫోన్ చేయగా ఆమె స్పందించి బస్సు సిబ్బందికి ఫోన్ చేసి వెంటనే ప్రయాణీకుడి డబ్బుల బ్యాగ్‌ను అప్పగించాలని సూచించారు. బస్సు డ్రైవర్ రామకృష్ణ , కండక్టర్ భీమాలు డబ్బుల బ్యాగ్‌ను ప్రయాణీకుడికి ఫోన్ చేసి అందజేశారు. దీంతో నిజాయితీ చాటుకున్న బాన్సువాడ ఆర్టీసీ సిబ్బందిని డిపో మేనేజర్ శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించి , వారిపై ప్రశంసల జల్లు కురిపించారు.

కరడ్‌పల్లిలో పేకాటరాయుళ్ల అరెస్టు


పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

తాడ్వాయి,మే14 (ఆంధ్రజ్యోతి):వ మండలంలోని కరడ్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాడ్వాయి ఎస్సై మురళీ తెలిపారు. ఉట్నూర్ రాజు, గోపని సంతోష్, మంగలి నర్సయ్య అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 8,700, మూడు సెల్ ఫోన్లు, అలాగే మూడు బైక్‌లను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని వారి ముగ్గురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా పేకాట ఆడినట్లు సమాచారం తెలిస్తేచట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

